ఆధ్యాత్మిక అమృతవాహిని

# శ్రీ రామకృష్ణ ప్రభ

జూన్ 2014 ₹10



## ప్రకృతి విలాసం...హృదయ వికాసం



# సుబోధ

**భక్తుడు:** సంసారాన్ని త్యజించడం మంచిదేనంటారా?

**శ్రీరామకృష్ణులు:** సంసార త్యాగం అందరికీ వర్తించదు. భోగతృష్ణ తీరని వారు సంసారాన్ని త్యజించరాదు.

**భక్తుడు:** 'భోగతృష్ణ' అంటే అర్థం ఏమిటి?

**శ్రీరామకృష్ణులు:** భోగతృష్ణ అంటే – కామ, కాంచన భోగాలు. ఊరగాయ జాడీలు, నీటి బుంగలు ఉంచిన గదిలో సన్నిపాత (టైఫాయిడ్) రోగిని ఉంచడం ప్రమాదం కదా! సిరిసంపదలు, పేరుప్రతిష్ఠలు, దేహసుఖాలు ఇత్యాది భోగాలను అనుభవించకుండానే, భగవంతుని కోసం వ్యాకులత జనించడం అందరికీ సాధ్యం కాదు.

**భక్తుడు:** అలాంటప్పుడు సంసార జీవితమే గడపాలా?

**శ్రీరామకృష్ణులు:** అవును. అనురక్తి రహితంగా విధ్యుక్త కర్తవ్యాలను నిర్వర్తించాలి – నూనె రాసుకొని పనస తొనలను ఒలిస్తే చేతికి జిగట అంటుకోని రీతిలో. ధనవంతుడి ఇంట్లో దాసి తన పనులన్నీ నిర్వర్తిస్తుంది; కానీ ఆమె మనస్సు గ్రామంలోని తన కుటుంబం మీదే ఉంటుంది. అనురక్తి రహితంగా కర్తవ్యాలను నిర్వర్తించడానికి ఇదొక ఉదాహరణ. ఇదే మానసిక పరిత్యాగం. గృహస్థులు సంసారాన్ని మానసికంగా పరిత్యజించాలి. కానీ సన్న్యాసి బాహ్యంగానూ, ఆంతరంగికంగానూ త్యజించాలి.

**భక్తుడు:** అయితే స్త్రీలు చెడ్డవారా?

**శ్రీరామకృష్ణులు :** విద్యారూపిణులైన స్త్రీలూ ఉన్నారు, అవిద్యారూపిణులైన స్త్రీలూ ఉన్నారు. విద్యారూపిణులైన స్త్రీలు, పురుషుణ్ణి భగవంతుని వైపుగా తీసుకొనిపోతారు. కానీ అవిద్యారూపిణులు భగవంతుణ్ణి మరపింపజేస్తారు.

"భగవంతుని మహామాయ ద్వారా ఈ జగత్తు సృష్టి అయింది. మహామాయలో విద్యామాయ, అవిద్యామాయ – రెండూ ఉన్నాయి. విద్యామాయను ఆశ్రయిస్తే సాధుసంగం, జ్ఞానం, భక్తి, ప్రేమ, వైరాగ్యం మొదలైన సద్గుణాలు అలవడతాయి. అవిద్యామాయను ఆశ్రయిస్తే కామ క్రోధాది దుర్గుణాలు అలవడతాయి – ఇవి భగవంతుణ్ణి మరపింప చేస్తాయి."

**భక్తుడు:** అవిద్యాశక్తి అజ్ఞానానికి హేతువు అయినప్పుడు, భగవంతుడు దాన్ని ఎందుకు సృష్టించాడు?

**శ్రీరామకృష్ణులు:** అదే ఆయన లీల. చీకటి లేకుంటే వెలుగు మహిమను ప్రశంసించలేము. దుఃఖం లేకుంటే సుఖం విలువను గ్రహించలేము. 'చెడు' అన్న ఎరుక ఉన్నప్పుడే 'మంచి'ని కూడా ఎరుగగలుగుతాం. ❖

**శ్రీరామకృష్ణ ప్రభ**
రామకృష్ణ మఠం, దోమల్‌గూడ, హైదరాబాదు-500 029
ఫోన్: 040-27667799, సెల్: 8801849494
E-mail : sriramakrishnaprabha@gmail.com
నిర్వాహక సంపాదకులు: స్వామి జ్ఞానదానంద
సంపాదకులు: స్వామి పరిజ్ఞేయానంద

## లోపలి పేజీల్లో...


6 సంపాదకీయం
భావిపౌరుల భాగ్యదాతలు

8 గోరుముద్ద
నాలుగు స్తంభాలాట!

9 భగవత్ ప్రసాదం

10 పలికెడిది భాగవతం
కాలము విచిత్రము... దుస్తరము!

12 మన సంస్కృతి
హైందవ రాజ్యాంగ వ్యవస్థ

14 దివ్యజీవనంలో దినచర్య ప్రాధాన్యం

15 రంగక్షేత్ర మల్లదిగో...

16 పరిప్రశ్న

17 రామకృష్ణ భక్తి సూత్రాలు

18 ఉదాత్త గుణం

19 ప్రేమమయి శారద

20 పవిత్ర జీవనంతో ప్రశాంత వార్ధక్యం

21 ధీరవాణి
హృదయాన్నే అనుసరించండి!

22 'నారి' కాదు - నారాయణి!

24 పారిశుద్ధ్యం... పారమార్థికత

26 ప్రేమ ఋణం

27 యువవాణి
జీవితం సుధాభరితం

28 అద్దంలో కొండలా...

30 పసిహృదయంలో పరివర్తన

31 స్వేచ్ఛా జీవనమంటే...

33 ముందుకు సాగిపో!

35 జీవన వేదం - స్వామీజీ కథల సారం
మాయను ఛేదించు! / ఎడారిలో పయనం!

36 భగవద్గీత - సద్గుణ సుధ
'విషాదం' యోగమా?

37 వికాస మంత్రాలు

38 బొమ్మల కథ
దేవుడు తీసుకున్న దిండు


ఈ సంచికలోని రచయిత(త్రు)ల అభిప్రాయాలు వ్యక్తిగతమైనవి. సంపాదకులు గానీ, హైదరాబాద్ రామకృష్ణ మఠం గానీ వాటికి బాధ్యత వహించజాలరు. - సంపాదకులు

### శ్రీరామకృష్ణ ప్రభ చందాదారులకు విన్నపం

ప్రియ పాఠకులారా!

- 'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక కవరు మీద చిరునామాకు పైన మీ చందా నంబరు, కుడి వైపున మీ చందా గడువు ముగిసే నెల ఉంటాయి. మీ చందా గడువు పూర్తయ్యే నెలకు ముందుగానే సొమ్మును చెల్లించి చందాను పునరుద్ధరించుకోండి.
- మీ ఉత్తర ప్రత్యుత్తరాలన్నింటిలో తప్పనిసరిగా చందా నంబరు పేర్కొనాల్సిందిగా మనవి.
- మీ చిరునామా మారిన పక్షంలో 7వ తేదీ లోగా మాకు తెలియపరచినట్లయితే, వచ్చే నెల సంచిక నుండి మీ కొత్త చిరునామాకు పంపబడును.
- ప్రతీ నెల 26 లేదా 27వ తేదీల్లో పత్రిక పోస్ట్ అవుతుంది. మీకు పత్రిక 15వ తేదీ లోపుగా చేరనట్లయితే, వెంటనే మాకు తెలియజేయగలరు.

శ్రీరామకృష్ణ ప్రభ ద్వారా అవిచ్ఛిన్నంగా సేవలు అందించాలన్నదే మా ఆకాంక్ష అందుకు మీ సహకారం కోరుతూ.... - సర్క్యులేషన్ మేనేజర్

**'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక చందాను ఆన్‌లైన్ http://rkmath.org/srkp ద్వారా చెల్లించవచ్చును.**

పాఠశాలలకు వేసవి సెలవులు ఇవ్వగానే పిల్లలకు వేసవి శిబిరాలంటూ ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు మొదలవుతున్నాయి. ఈ మధ్యకాలంలో వేసవి శిబిరాలకు గిరాకీ బాగానే పెరిగింది. కొన్ని సంస్థలు నిర్వహిస్తున్న వేసవి శిబిరాలలో ప్రవేశం దొరకడమే గగనమైపోతోంది. ఇంతకీ వేసవి శిబిరాలకు ఎందుకు ఇంత గిరాకీ? పిల్లలు నీతివాక్యాలు, విలువల పాఠాలు, వికాస సూత్రాలు నేర్చుకుంటారనా? అది నిజమే! కానీ అధికశాతం మంది తల్లితండ్రుల నుండి వచ్చిన సమాధానం మాత్రం 'అబ్బా! పిల్లలతో వేగలేకపోతున్నాం. శిబిరాల్లో పడేస్తే మాకు కాస్త మనశ్శాంతి దొరుకుతుంది' అని.

తల్లితండ్రుల అభిప్రాయంలో కొంత నిజం లేకపోలేదు. చిచ్చరపిడుగుల్లాంటి పిల్లల్ని కట్టడిచేయడం కత్తి మీద సామే! కానీ Institutions build professionals. Parents develop the persons. Parents are the primary architects in the development of character in children. సంస్థలు, పిల్లల్లో మేధోవికాసాన్నీ, వృత్తి నైపుణ్యాన్నీ పెంచడానికి తోడ్పడతాయి. కానీ మనోవికాసానికీ, వ్యక్తిత్వవికాసానికీ మాత్రం తల్లితండ్రులే ప్రథమ రూపకర్తలు.

అందుకే స్వామి వివేకానంద ఇలా అంటారు: Parents are constantly taxing their children to read and write, telling them they will never learn anything... అందువల్ల తల్లితండ్రులు పిల్లల్ని స్కూల్, ట్యూషన్, ఫౌండేషన్ కోర్సులంటూ చదువుల చట్రంలో బిగించి, వారిని ఉక్కిరిబిక్కిరి చేయకూడదు. పిల్లలు వట్టి మరమనుషులుగా మారకుండా, మనసున్న మనుషులుగా ఎదగడానికి తోడ్పడాలి.

**భావిపౌరులను తీర్చిదిద్దే బాధ్యత:** ఒక విత్తనంలో ఓ మహావృక్షం దాగివున్నట్లు, పిల్లవాడిలో మహోన్నత వ్యక్తి దాగివున్నాడు. కర్షకుడు సేద్యం చేసి పంటలు పండించడానికి ఎంత కృషి చేస్తాడో; ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటాడో; ఎంత సహనంతో వ్యవహరిస్తాడో; తల్లితండ్రులు కూడా పిల్లల వ్యక్తిత్వ నిర్మాణ విషయంలో అంత శ్రద్ధ, అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలి. పిల్లల్ని నిర్లక్ష్యం చేసే తల్లితండ్రులు శత్రువులతో సమానమని హెచ్చరిస్తూ...

**మాతా శత్రుః పితావైరీ యేన బాలో న పాఠితః ।**
**న శోభతే సభా మధ్యే హంస మధ్యే బకో యథా ॥**

'పిల్లల చదువు సంధ్యలను పట్టించుకోని తల్లితండ్రులు వారి పాలిట శత్రువులు. అలాంటి తల్లితండ్రుల వల్ల పిల్లలు హంసల మధ్య కొంగల్లాగ నలుగురిలో అపహాస్యం పాలవుతారు' అని మన శాస్త్రాలు తల్లితండ్రుల బాధ్యతను గుర్తుచేస్తున్నాయి.

అందువల్ల తమ పిల్లలు ఉన్నతంగా రాణించేలా తల్లితండ్రులు బాధ్యత వహించాలి. అప్పుడే భావి పౌరులను తీర్చిదిద్దే భాగ్యదాతలు తల్లితండ్రులే అని నిరూపించినవారవుతారు.

**లేత మనస్సుల్లో కలుపుమొక్కలు:** ప్రతి తల్లీ తండ్రీ తమ పిల్లలు ఎలాంటి చెడు అలవాట్లకూ బానిసలు కాకూడదని ఆశిస్తారు. అందువల్ల పిల్లల పెంపకంలో మెలకువలు తెలుసుకోవడానికి సదస్సులకు హాజరవుతున్న వారి సంఖ్య పెరుగుతూనే ఉంది.

ఒక నగరంలో ఓ మేనేజ్‌మెంట్ గురువు తల్లితండ్రుల కోసం 'పిల్లల పెంపకంపై మెలకువలు' అనే సదస్సును నిర్వహించాడు. ఆ సదస్సుకు చాలా మంది తల్లితండ్రులు హాజరయ్యారు. సదస్సు అయిన తరువాత ఓ దంపతులు, గురువు వద్దకు వెళ్ళి "గురువుగారూ! మీరు చెప్పిన చిట్కాలు బాగానే ఉన్నాయి. కానీ మేము ఎంత ప్రయత్నించినా మా అబ్బాయి చెడు అలవాట్లను మాన్పలేకపోతున్నాం. రేపు మీ దగ్గరకు మా పిల్లవాడిని తీసుకువస్తాం. అతడు చెడు అలవాట్లను మానేలా మీరే కాస్త హితబోధ చేయండి" అని విన్నవించుకున్నారు.




మరుసటి రోజున ఆ దంపతులు తమ అబ్బాయిని తీసుకొని గురువు దగ్గరకు వచ్చారు. గురువు వారితో అలా తోటలోకి వెళుతూ, ఆ అబ్బాయికి అక్కడున్న చిన్న మొక్కను చూపించి దాన్ని పీకివేయమన్నాడు. వెంటనే అబ్బాయి ఆ మొక్కను ఒక్కచేత్తో సునాయాసంగా పీకేశాడు. అలా మరికొంతదూరం వెళ్ళిన తరువాత గురువు ఆ అబ్బాయికి ఓ పెద్ద మొక్కను చూపించి దాన్ని పీకమన్నాడు. ఆ అబ్బాయి రెండు చేతులతో మొక్కను గట్టిగా పట్టుకొని లాగేశాడు. మరికొంత దూరం వెళ్ళాక గురువు ఆ అబ్బాయిని అక్కడున్న చెట్టును పెకలించమన్నాడు. అప్పుడు ఆ అబ్బాయి రెండు చేతులతో చెట్టు మొదలును గట్టిగా పట్టుకొని పెకలించడానికి విశ్వప్రయత్నం చేశాడు. కానీ ఆ చెట్టును కనీసం కదిలించలేకపోయాడు. అప్పుడు గురువు, తల్లితండ్రుల వైపు చూస్తూ, "లేతమనస్సులో చెడు అలవాట్లనే కలుపుమొక్కలను వెంటనే తొలగించాలి. మనస్సులో అవి దృఢంగా పాతుకుపోయిన తరువాత వాటిని పెకలించడం సాధ్యం కాదు" అని వివరించాడు. గురువు ప్రయోగాత్మకమైన బోధలోని అంతరార్థాన్ని గ్రహించారు ఆ తల్లితండ్రులు.

కాబట్టి తల్లితండ్రులు పిల్లల్లోని లోపాలను ప్రాథమిక దశలోనే గుర్తించి, సరిదిద్దడానికి ప్రయత్నించాలి. అందు కోసం వారితో వీలైనంత ఎక్కువ సమయం గడపడానికి ప్రాధాన్యమివ్వాలి.

**ప్రశంసలు ప్రగతికి బాటలు:** పిల్లలు తమ శక్తి సామర్థ్యాలకు అనుగుణంగా ఏమి చేసినా తల్లితండ్రులు, వారిని ప్రశంసిస్తూ,




'బాగా చేశావు, ఇంకా బాగా చేయగలవు' అని ప్రోత్సహించాలి. ఆ ప్రశంసల జల్లులే వారిలో ఆత్మవిశ్వాసాన్ని అంకురింప జేస్తాయి. తల్లితండ్రుల ప్రశంసలకు నోచుకోని పిల్లల్లో ఆత్మన్యూనతాభావం పెరుగుతుంది. దానివల్ల వారు ఇతరులతో కలిసిమెలసి ఉండలేరు. ఇతరులను మెప్పించలేరు. అందుకే స్వామి వివేకానంద "పిల్లల్ని – 'మీరు మూర్ఖులు. ఎందుకూ పనికిరారు' అని అంటూ ఉంటే వారు నిజంగానే ఎందుకూ పనికిరానివారవుతారు. పిల్లల తప్పులను ఎత్తిచూపడం కాకుండా, ఆ తప్పుల నుండి బయటపడే మార్గాన్ని వారికి సూచించాలి. అలా మంచిమాటలతో వారిని ప్రోత్సహిస్తే వారు తప్పకుండా పురోగతిని సాధిస్తారు" అని తల్లితండ్రులకు మార్గనిర్దేశం చేశారు.

'కఠోపనిషత్తు'లోని నచికేతుని ఆత్మవిశ్వాసానికి యమధర్మరాజు సైతం అబ్బురపడ్డాడు. నచికేతుని తండ్రి 'నిన్ను యమునికి ఇస్తున్నాను' అని అన్నప్పుడు నచికేతుడు **'బహూనామేమి ప్రథమో బహూనామేమి మధ్యమః...** – నేను అనేక విషయాల్లో ఉత్తముణ్ణి, ఇంకా అనేక విషయాల్లో మధ్యముణ్ణి. అంతేగానీ అధముణ్ణి మాత్రం కాను' అని తన ఆత్మవిశ్వాసాన్ని వ్యక్తపరిచాడు.

ప్రతీ తల్లీ తండ్రీ తమ పిల్లల్లో నచికేతుడి లాంటి ఆత్మవిశ్వాసాన్నీ, ఆత్మగౌరవాన్నీ పెంపొందించేలా ప్రయత్నించాలి. అప్పుడే జీవితంలో ఎదురయ్యే అవరోధాలను పిల్లలు ధైర్యంగా ఎదుర్కొని, ఉన్నతంగా ఎదగడం సాధ్యమవుతుంది.

**శీలసౌధానికి శిల్పులు:** ఏ మహోన్నత వ్యక్తి జీవితాన్ని తెరచి చూసినా వారి వ్యక్తిత్వనిర్మాణానికి రూపకర్తలు ముఖ్యంగా తల్లితండ్రులే అని తెలుస్తుంది.

శత్రుదుర్భేద్యమైన కోట లాంటి ఛత్రపతి శివాజీ వ్యక్తిత్వాన్ని పటిష్ఠపరిచిందెవరు? ఆయన తల్లి – జిజియాబాయి; ప్రాణాలు పోయినా సత్యపథాన్ని విడనాడవద్దని ప్రబోధించి, స్వామి వివేకానందుని సత్యనిష్ఠకు పటిష్ఠమైన పునాది వేసింది ఎవరు? ఆయన తల్లి – భువనేశ్వరీదేవి; మనిషిని బానిసగా చేసే మద్యం, మగువల వ్యామోహాలలో పడవద్దని హితబోధ చేసి, గాంధీజీ శీలసౌధానికి రూపకల్పన చేసిందెవరు? ఆయన తల్లి – పుతిలీబాయి; ఆంగ్లేయుల అకృత్యాలను అరికట్టాలని ధీరవచనాలను నూరిపోసి, అల్లూరి సీతారామరాజును విప్లవ సింహంగా మలచిందెవరు? ఆయన తండ్రి – వేంకట రామరాజు; పరుల నుండి ప్రతిఫలాన్ని ఆశించకుండా నిజాయతీగా జీవించు అని మానవతా విలువలను బోధించి, అబ్దుల్ కలామ్‌ను భారతరత్నంగా మెరుగులు దిద్దిందెవరు? ఆయన తండ్రి – జైనులాబ్దీన్.

పిల్లల శీలసౌధానికి శిల్పులు తల్లితండ్రులే అని పైన ఉదహరించిన మహాత్ముల జీవితాలే తార్కాణం. విద్యాసంస్థలు, వికాసకేంద్రాలు ఎన్ని ఉన్నా ఇంటిని మించిన విద్యాసంస్థ, తల్లితండ్రులను మించిన వ్యక్తిత్వ వికాస నిపుణులు వేరే లేరు. తల్లితండ్రుల జీవితమే – పిల్లలకు తెరచిన వ్యక్తిత్వ వికాస పుస్తకం. పిల్లల్ని శీఘ్రంగా ప్రభావితం చేసేవి మాటల కన్నా చేతలే. కాబట్టి తల్లితండ్రులు మాటలతో చెప్పడం కాకుండా, చేతలతో చేసి చూపించి వారికి ఆదర్శంగా నిలవాలి. తల్లితండ్రుల ఆదర్శజీవనమనే మూస ఆధారంతో పిల్లలు శీలవంతులైన వ్యక్తులుగా తయారవుతారు. ఆ విధంగా తల్లితండ్రులు భావిపౌరులను తీర్చిదిద్దే భాగ్యదాతలుగా శాశ్వత కీర్తిని ఆర్జిస్తారు. ❖

పిల్లల తప్పులను ఎత్తిచూపడం కాకుండా, ఆ తప్పుల్ని సరిదిద్దుకొనే మార్గాన్ని సూచించాలి. అలా మంచిమాటలతో వారిని ప్రోత్సహిస్తే వారు తప్పకుండా పురోగతిని సాధిస్తారు. - స్వామి వివేకానంద

**End of Preview.**

**Rest of the book can be read @**

**[http://kinige.com/book/Sri+Ramakrishna+Prabha+June+2014](http://kinige.com/book/Sri+Ramakrishna+Prabha+June+2014)**

* * *